

# కథా కౌముది

## సాయం

సన్నిహిత్

"మానవ సేవయే మాధవ సేవ! , పరోపకారం ఇదం శరీరం!, ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇన్ డీడ్!"లాంటి వాక్యాలు చాలా గొప్పవని అందరూ అంటుంటారు. కానీ నాకు వాటిమీద ఎక్కువ నమ్మకం లేదు. ఇవన్నీ మనిషి తన అవసరాలకోసం, స్వార్ధం కోసం ఏర్పరచుకున్న నీతులని నా నమ్మకం!

ఈ సమాజంలో చేతగాని వాళ్ళు, కష్టపడలేని వాళ్ళు, తమ కాళ్ళమీద తాము నిలబడలేని వాళ్ళు, ఎవరో తమకు సాయం చెయ్యాలని, చేస్తారని ఎదురు చూసే వాళ్ళు జాగ్రత్తగా ఆలోచించి ఫ్రేం చేసిన వాక్యాలని అనిపిస్తాయి.

ముప్పై ఏళ్ళ క్రితం అంటే నాకు ఇరవై ఏళ్ళ వయసున్నపుడు ప్రభుత్వోద్యోగంలో జాయినయ్యాను. కష్టపడి ప్రమోషన్‌లు సాధించి ఉన్నత స్థానానికి చేరుకున్నాను. ఏ రోజూ ఎవ్వరినీ సాయం అడగలేదు. ఆ అవసరం కూడా రాలేదు. ఎంతో దర్జాగా బ్రతికాను. అయితే మనకున్న అభిప్రాయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, అవి నిరంతరం మారుతూ ఉంటాయని అనడానికి నా జీవితమే ఉదాహరణ. బలంగా వేళ్ళూనిన నా భావాలన్నీ కూకటి వేళ్ళతో సహా పెకలించబడ్డానికి కారణభూతమైన సంఘటన ఒకటి నా జీవితంలో కొంతకాలం క్రితం జరిగింది.

●●●

హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ప్రొద్దున్న ఎనిమిదింటికి కలకత్తా ఫ్లైట్ కోసం నేనూ నా భార్యా వెయిట్ చేస్తున్నాం. నా భార్య అంది "మన పిల్లలు కూడా ఉంటే బాగుండునండి! హాయిగా అందరం కలిసి వెళ్ళేవాళ్ళం" అని. చిన్నగా నిట్టూర్చాను. ప్రస్తుతం మేము వెళుతున్నది నార్త్ ఈస్ట్ ఇండియాలో ఉన్న 'గాంగ్‌టక్' ప్రాంతానికి. సెంట్రల్ గవర్నమెంట్ వాళ్ళు అక్కడి టూరిజం డెవలప్‌మెంట్ కోసం ఎల్.టి.సి. అవకాశం ఇవ్వడంతో నాలాంటి ఎంతోమంది గవర్నమెంట్ సర్వెంట్స్ అక్కడికి వెళుతున్నారు. ఆ అవకాశం నేను కూడా వినియోగించుకుంటున్నాను.

అయితే మాకున్న ఇద్దరు అబ్బాయిలు పెళ్ళిళ్ళు చేసుకుని అమెరికాలో సెటిల్ అయ్యారు. నేను ఎంత బ్రతిమాలి రమ్మన్నావాళ్ళు ఇండియా రారు. ఇంక వాళ్ళని ఎల్.టి.సి మీద తీసుకెళ్ళడం అనేది ఒక కల మాత్రమే. చిన్నగా నిట్టూర్చి "మనకంత అదృష్టం లేదు లేవే!" అన్నాను. ఇంతలో మేము వెళ్ళాల్సిన ఫ్లయిట్‌కి బోర్డింగ్ స్టార్ట్ అయిందని ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. హేండ్ లగేజ్ తీసుకుని కౌంటర్ వైపు వెళ్ళాము.

అయితే మేము కలకత్తా చేరుకున్నాక అక్కడి నుండి ఫ్లయిట్‌లో 'బాగ్డోగరా' వెళ్ళాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఫ్లయిట్ సౌకర్యం లేదు కాబట్టి ఘాట్ రోడ్ ద్వారా ప్రయాణించి గాంగ్‌టక్ చేరుకోవాలి. ఇదీ మా ప్లాన్!

రెండున్నర గంటల వాయు ప్రయాణం తర్వాత కలకత్తాలో దిగాము. ఎన్నోసార్లు ఆఫీసు పని మీద ఇక్కడికి వచ్చాను కాబట్టి ఈ ఊరు నాకు కొత్తకాదు. కానీ నా భార్యకు ఇదే మొదటిసారి. ఎయిర్ పోర్ట్ నుండి బయటకు వచ్చి ఒక గంట సేపు నగరమంతా తిరిగాము. నా భార్య కళ్ళలో వింత అనుభూతి కనబడింది.

మళ్ళీ ఎయిర్ పోర్ట్ చేరుకుని 'బాగ్డోగ్రా' ఫ్లయిట్ కేచ్ చేసాం. సుమారు గంటసేపు ప్రయాణం చేసి 'బాగ్డోగ్రా' ఎయిర్ పోర్ట్ చేరుకున్నాం.

చాలా చిన్న ఎయిర్ పోర్ట్ అది!

మేము బయటికి వచ్చేటప్పటికి 'ప్లకార్డ్'తో డ్రైవర్ ఆహ్వానం పలికాడు. ఇన్నోవా కారులో మమ్మల్ని కూర్చోబెట్టి స్మూత్‌గ ముందుకి ఉరికించాడు.

కారు కిటికీలో నిండి బయటికి చూస్తుంటే ఎంతో ఆహ్లాదంగా అనిపించింది. విస్తరించి ఉన్న విశాలమైన పచ్చటి కొండలు. వాటి మీద ఏటవాలుగా పెరిగిన తేయాకు తోటలు. అందులో పని చేసుకుంటున్న కూలీలు. ఎంత అదృష్టవంతులు వాళ్ళు! ఏ సమస్యా లేని శ్రమ జీవులు! కలో గంజో తాగి సంతృప్తి పడే ఆనంద జీవులు! వాళ్ళని చూస్తుంటే నా మనసు అసూయతో మూలిగింది. అవును మరి, పొద్దున్న లేచిన దగ్గరి నుండి ఆఫీసు గురించే ఆలోచిస్తూ, ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఎవడ్ని ఎలా తొక్కేయ్యాలా అని ఆలోచిస్తూ నిరంతరం అంతర్లీనంగా ఏడుస్తుండే నా మనసు అసూయ పడటంలో ఆశ్చర్యమేముంది?

...అలా ప్రకృతి సౌందర్యాస్వాదన నుండి తేరుకునేటప్పటికి గాంగ్‌టక్‌లోని మా హోటల్ కి చేరుకున్నాం.

చిన్నకొండ లాంటి ఎత్తైన ప్రాంతం మీద ఉంది ఆ హోటల్!

మాకు బుక్ చేసిన రూంలో సెటిలయ్యాక కిటికీ తెరిచి చూస్తే ఎంతో ముచ్చటేసింది. కొండపై భాగం నుండి పాదం వరకు విస్తరించి ఉన్న చిన్న చిన్న ఇళ్ళు. శీతాకాలం కావడంతో ఆ ఇళ్ళల్లో నుండి వస్తున్న పొగ పల్చటి మేఘంలా అంతటా వ్యాపించి ఉంది. సాయంకాలపు చలిగాలులు నెమ్మదిగా వీస్తున్నాయి. హాయిగా అనిపించింది. ఎటువంటి డిస్టర్బన్స్ లేని వాతావరణం. ఎటువంటి టెన్షన్స్ లేని ఖాళీ సమయం. మనలోకి మనం తొంగి చూసుకోవడానికి, మన మనసుతో మనం సంభాషించు కోవడానికి అనువైన వాతావరణం!

నా భార్య అప్పటికే రూమంతా చెక్ చేసినట్లుంది. "బాత్రూంలో చక్కగా వేన్నీళ్ళు వస్తున్నాయి వెళ్ళి ఫ్రెష్ అవండి" అని ఆర్డర్ వేసింది.

"ఓకే మేడం! అలాగే" అంటూ టవల్ తీసుకుని బాత్రూంలో దూరాను.

●●●

మరుసటి రోజు పొద్దున్న ఫలహారాలు పూర్తిచేసి జీప్‌లో బయలుదేరాం. పర్వత సానువుల్లో ప్రయాణించి 'డార్జిలింగ్' చేరుకోవడం మా గమ్యం. డ్రైవర్ ఎంతో చాకచక్యంగా జీపునడుపుతున్నాడు. మా జీపు వెళుతున్న తారు రోడ్డు చాలా సన్నగా ఉంది. దాని కిరువైపులా పెద్ద పెద్ద లోయలు! జీప్‌లో నుండి కిందికి చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయి. ఆ రోడ్డు నానుకుని కొండ రాళ్ళ సపోర్ట్ మీద కట్టబడిన చెక్క ఇళ్ళు, హోటళ్ళు దారిలో అక్కడక్కడ అగుపించాయి. అందమైన పూల తీగలు రోడ్డు మీద నుండి లోయల్లోకి విస్తరించి ఎక్కడో మాయమవుతున్నాయి. ఆ భగవంతుడు ప్రసాదించిన ప్రకృతి సౌందర్యం ఎంత చూసినా ఇంకా తనివి తీరదని అనిపించింది.

ఎట్టకేలకు ఆ కొండ దారిగుండా పడుతూ లేస్తూ ప్రయాణించిన మా జీప్ 'డార్జిలింగ్' చేరుకుంది. 'హమ్మయ్య!' అనుకుంటూ జీప్ దిగి హోటల్‌లో చెక్ఇన్ చేసాం.

లంచ్ టైంలో మా హోటల్ వాళ్ళు చెప్పారు "డార్జిలింగ్‌లో సూర్యోదయం చూడ్డానికి ఎంతో అందంగా ఉంటుంది. పొద్దున్నే వెళ్ళండి సార్!" అని.

"అలాగే!" అనుకుంటూ లంచ్ తర్వాత డార్జిలింగ్ లో చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసేసాం - ఒక్క సూర్యోదయం తప్ప! కొత్త ప్రాంతాన్ని చూసిన ఆనందాన్ని గుండెనిండా నింపుకుని ఆ రాత్రికి ప్రశాంతంగా నిద్రపోయాం నేనూ నా భార్య.

●●●

వేకువ జాము నాలుగ్గంటల సమయం.

డార్జిలింగ్ లోని ఎత్తైన కొండ మీదున్న 'సన్‌రైజ్' పాయింట్ దగ్గర మేమంతా వెయిట్ చేస్తున్నాం! మాలాగే ఎంతో మంది టూరిస్టులు, సూర్యోదయం చూడటం కోసం అంత చలిలోనూ స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి ఎదురు చూస్తున్నారు. చుట్టూతా టీలు, కాఫీలు అమ్మే కుర్రాళ్ళు హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతున్నారు. ఇంతలో దూరంగా ఉన్న కొండల వెనుక నుండి బంగారు రంగు భాను కిరణాలు పైకి వెదజల్లుతూ ఒక్కసారిగా కనిపించాయి. కాసేపటికి - ఈ సమస్త భూప్రపంచాన్ని చైతన్యవంతం చేయడానికి, జీవకోటిలో ప్రాణం నింపడానికి అన్నట్లు అశ్వారుఢుడై నెమ్మదిగా పైకి వచ్చాడు ఆ సూర్య భగవానుడు. టూరిస్టులు అంతా ఆనందంతో కేరింతలు కొడుతూ ఆ సుందర దృశ్యాన్ని తమ కెమేరాల్లో బంధిస్తున్నారు. నిజంగా ఎంత అద్భుతమైన దృశ్యం! నాకు మనసు పులకించిపోయింది. ఆనంద పారవశ్యంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ బంగారు రంగు సూర్య కిరణాలు అభిముఖంగా ఉన్న హిమాలయ పర్వత శిఖరాల మీద పడి, ఆ శిఖరపు శోభను మరింత ఇనుమడింప జేస్తున్నాయి. ఆ అందాన్నంతా నా కెమేరాలో బంధించేసాను. ఈ జన్మకి ఈ సంతోషం చాలు అనిపించింది. ఇంతకు ముందు ఎన్నోసార్లు విహార యాత్రలకు వెళ్ళాను, కొత్త కొత్త ప్రకృతి అందాలన్నింటినీ చూసాను. అయితే అవన్నీ ఒక ఎత్తు, ఇది ఒక ఎత్తు. బహుశా నా మనసు కూడా మార్పును కోరుకుంటుందేమో! ప్రాపంచిక ఆనందాల్ని ఆస్వాదించాలని ఆశపడుతుందేమో! అందుకే ఈ పులకింత! కాసేపటికి పూర్తిగా సూర్యోదయం అయింది. ఉషోదయపు వెలుతురు అంతటా వ్యాపించింది. టూరిస్టులంతా నెమ్మదిగా తమ తమ వెహికల్స్‌లో కొండ దిగి కిందికి వెళుతున్నారు. మేము కూడా మా జీప్‌లో బయలుదేరాం.

మా జీప్ నెమ్మదిగా కిందికి దిగడం ప్రారంభించింది. డ్రైవర్ ఎంతో జాగ్రత్తగా నడుపుతున్నాడు. అయితే అనూహ్యమైన సంఘటనలు ఎప్పుడూ కనురెప్ప పాటులో జరిగిపోతూ ఉంటాయి. వాటి ప్రభావం మనం తేరుకునేలోపు మనల్ని పూర్తిగా ముంచేస్తుంది. ఘాట్ రోడ్డులోని ఒక చిన్న మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న వేరే జీపని తప్పించబోయి మా జీపని కొంచెం స్పీడ్ గా పక్కకు తిప్పాడు డ్రైవర్. అంతే! ఏమైందో ఏమో మా జీప్ అదుపు తప్పింది. బహుశా డ్రైవర్ షాక్ లోనికి వెళ్ళిపోయాడేమో కంట్రోల్ చేయలేకపోతున్నాడు. భయంతో మేమంతా హాహాకారాలు చేయసాగాము. జీప్ అదే వేగంతో ముందుకు ఉరికి లోయలోకి జారిపోయింది. భయంతో నేను "బచావ్! బచావ్!", "హెల్ప్!... హెల్ప్!" అంటూ గట్టిగా అరిచాను. నా జీవితంలో మొట్టమొదటిసారిగా, నా గుండె గోడల్ని బ్రద్దలు గొట్టుకుని, నా గొంతులో నుండి అప్రయత్నంగా "హెల్ప్" అనే మాట బయటకు వచ్చింది. ఆ తర్వాత నాకు స్పృహ కోల్పోయింది.

నేను కళ్ళు తెరిచి చూసేటప్పటికి ఖరీదైన హాస్పిటల్ బెడ్ మీద ఉన్నాను. చుట్టూ నా కొడుకులూ, కోడళ్ళూ, డాక్టర్లూ! నా కళ్ళు నా భార్య కోసం వెదికాయి. కానీ ఆమె జాడ లేదు. నేను ఏదో అడగాలని ప్రయత్నించాను. కానీ నాకు ఆ అవకాశం ఇవ్వకుండా రెస్ట్ తీసుకోమని అందరూ నన్ను బలవంతం చేస్తున్నారు. నాకు ఏదోలీలగా అర్థం అవుతోంది.. నా భార్య ఈ లోకాన్ని వీడి వెళ్ళిపోయింది. నా

అహాన్ని, నా ఆవేశాన్ని, అన్నింటినీ భరించి చివరిదాకా తోడు ఉన్న నా భార్య ఇకలేదు. విపరీతమైన దుఃఖం కలిగింది. అలాగే ఏడుస్తూ ఏడుస్తూ మగతగా నిద్రలోకి జారుకున్నాను.

నా ఆరోగ్యం కోలుకుని మామూలు మనిషిగా మారి జన జీవన స్రవంతిలో కలవడానికి ఆరునెలలు కాలం పట్టింది.

ఆ రోజు మా జీప్ లోయలో పడిన తర్వాత మిగతా టూరిస్టులంతా రంగంలోకి దూకి మమ్మల్ని కాపాడే ప్రయత్నం చేసారు. అప్పటికే నా భార్య, జీప్ డ్రైవర్ ఇద్దరూ విగత జీవులయ్యారట. కొన ఊపిరితో కొట్టుకుంటున్న నన్ను మాత్రం దగ్గర్లోని మంచి హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసారు. ఈ భూమ్మీద ఇంకా నూకలు ఉన్నాయి కాబట్టి బ్రతికి బట్ట కట్టానని అందరూ అంటుంటారు. కానీ ఈ సంఘటనతో నా దృక్పథమే పూర్తిగా మారిపోయింది. ఇది ఒక రకంగా నాకు పునర్జన్మ! బహుశా నేను చెయ్యాల్సిన మంచి కార్యాలు ఈ భూమ్మీద ఇంకా ఏవో ఉండి ఉంటాయి, అందుకే ఆ భగవంతుడు నాకు ఆయుష్షు మిగిల్చాడు.

●●●

బాగా వర్షం పడుతోంది! సమయం సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది.

నా భార్య చనిపోయాక నాకు తోడులేకుండా పోయింది. నా కొడుకులిద్దరూ ఇక్కడి కార్యక్రమాల్ని పూర్తిచేసుకుని అమెరికా వెళ్ళిపోయారు. నా రోజువారీ పనులు చూసుకోవడానికి ఒక పనమ్మాయిని పెట్టుకున్నాను. ఆమె కూడా పొద్దుటి నుండీ సాయంత్రం వరకు ఉంటుంది. ఆ తర్వాత 'ఒంటరితనం' వద్దన్నా నాకు తోడుగా ఉంటుంది.

ఏమీ తోచక టీవీలో వస్తున్న రాజకీయ నాయకుల చర్చా కార్యక్రం చూస్తూ టీ తాగుతున్నాను. ఇటువంటి చర్చా కార్యక్రమాలు ఎందుకు కండక్ట్ చేస్తారో నాకు అర్థం కాదు. పొలిటీషియన్‌లు ఒకరి మీద ఒకరు బురద జల్లుకోవడానికి తప్పితే వీటి వలన ప్రజల కొచ్చే ప్రయోజనం ఏమీ లేదు.

"సార్!...సార్!" అని ఎవరో గేట్ మీద శబ్దం చేస్తూ పిలుస్తునట్లు అనిపించడంతో వెళ్ళి చూసాను.

వచ్చింది రామరాజు. అతడు మా ఇంటికి దగ్గర్లో ఉన్న ఒక వీడియో షాప్‌ని నడుపుతూ ఉంటాడు. అప్పుడప్పుడు నేను ఇతడి దగ్గర పాత సినిమా సీడీలు అద్దెకు తీసుకు వస్తూ ఉంటాను. అయినా ఇతడికి నాతో పనేంటబ్బా అనుకుని

"ఏం బాబూ! ఏం కావాలి?" అంటూ గేట్ తీసిలోనికి ఆహ్వానించాను.

"నమస్కారం సార్! మీతో కొంచెం పనిపడింది, అందుకే మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నాను, ఏమీ అనుకోకండి" అంటూ అతి వినయానికి పోతున్నాడు.

అయితే ఇతడి మీద నాకు సదభిప్రాయం లేదు. ఇతడి తల్లి రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటూ నాలుగు డబ్బులు సంపాదిస్తూ ఉంటుంది. తండ్రిలేడు. ఇతడేమో ఆ నాలుగు డబ్బులు లాక్కొని గర్ల్ ఫ్రెండ్స్ కోసం తగలేస్తూ ఉంటాడు. ఇక ఆ వీడియో షాప్‌ని ఎలా రన్ చేస్తున్నాడో ఆ భగవంతుడికే తెలియాలి. ఊరంతా అప్పులు చేసాడని, ఆ అప్పులు తీర్చకుండా జనాల్ని వేధిస్తుంటాడని అప్పుడప్పుడు నా చెవిన పడే మాటలు.'నాకెందుకులే' అని నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా డబ్బుల కోసమే నా దగ్గరకొచ్చాడ్ని చూచాయగా అర్థమైంది.

"సార్! కొంచెం డబ్బులు అప్పుకావాలి. చాలా కష్టంగా ఉంది, అభాగ్యులం సార్! ఆదుకొండి సార్!" అంటూ దీనంగా ముఖం పెట్టాడు.

కొంచెం ఇబ్బందిగా అనిపించింది నాకు. ఇంతకు ముందయితే ఇలాంటి వాళ్ళని అస్సలు ఎంటర్‌టైన్ చేసేవాడిని కాను. కానీ ఈ మధ్య మృత్యువుని జయించి బయటపడ్డాక 'సాయం' చెయ్యడం మీద నాకు విలువ పెరిగింది. అలాగని నేను చెయ్యబోయే మొట్టమొదటి సాయం 'ఇలాంటి వెధవ' కోసం కాకూడదని నా కోరిక.

"సరే! ఇంతకీ ఎంత కావాలేంటి?" అడిగాను.

"పదివేలు కావాలి సార్! రెండు నెలల్లో మీకు తిరిగి ఇచ్చేస్తాను, వడ్డీ కూడా కడతాను సార్!" అంటూ బ్రతిమాలాడు.

పదివేలు అంటే చాలా ఎక్కువ మొత్తం, అయినా ఏం చూసి ఇతనికి ఇవ్వాలి? ఇవ్వాలా, వద్దా అని డైలమాలో పడిపోయాను. చివరికి నా మనసు 'వద్దు' అనే చెప్పింది.

"అంత పెద్ద ఎమౌంట్ నా దగ్గర ఇప్పుడు లేదమ్మా! ఒక వారం తర్వాత కనబపడు చూస్తాను" అని చెప్పి వెళ్ళమన్నాను.

"ఏంటో సార్! నా బ్రతుకింతే!" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. రిలీఫ్‌గా ఫీల్ అయి, మళ్ళీ టీవీ చూడ్డంలో మునిగిపోయాను.

●●●

ఈ రోజు ఆదివారం!

నాకు చాలా ఇష్టమైన రోజు. ఎందుకంటే ఈ రోజు టైం మన చేతిలో ఉంటుంది, ఆఫీసు వాళ్ళు కూడా ఎవరూ మనల్ని డిస్టర్బ్ చేయరు. మనకు నచ్చిన పనులు మనం తీరిగ్గా చేసుకోవచ్చు. అందుకే ఆదివారమంటే నాకు ఇష్టం.

బ్రేక్ ఫాస్ట్ పూర్తి చేసి తీరిగ్గా వాలు కుర్చీలో కూర్చుని 'పేపర్' చదవడంలో నిమగ్నమయ్యాను.

ఇంతలో ఎవరో రోడ్డు మీద బిగ్గరగా ఏడుస్తున్న ధ్వని వినబడింది. ఉత్సుకతతో బయటకు వెళ్ళి చూసాను.

ఆమె రామరాజు తల్లి! గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. నన్ను చూడగానే పరుగెత్తుకుంటూ వచ్చి "బాబూ! సూడండి బాబూ! ఎంత ఘోరం జరిగిపోనాదో! ఆడు నాకు అన్నాయం సేసేసినాడు బాబో! నన్ను ఒంటిదాన్ని సేసిపోనాడు బాబో! ఓరి దేవుడో! నాకు దిక్కెవర్రా నాయనో!" అంటూ ఏడుస్తోంది.

"ఏమైందమ్మా? ఏం జరిగింది?" ఓదార్చ ప్రయత్నించాను.

"ఇంకేం జరగాలి బాబూ! ఏం కట్టం వచ్చిందో నా కొడుక్కి, ఉరేసుకున్నాడు బాబు!" అంటూ ఏడుస్తోంది. నాకు మెదడు బ్లాంక్ అవసాగింది. ఎంత ఘోరం జరిగింది!

"మైగాడ్! పదమ్మా!" అంటూ వాళ్ళ ఇంటి వైపు పరుగు తీసాను. అప్పటికే విషయం బయటకి పొక్కినట్లుంది, నలుగురూ గుమిగూడారు.

పోలీసులు వచ్చేదాకా ఆగి శవాన్ని కిందికి దించారు.

నా మనసంతా బాధతో నిండిపోయింది. రెండు రోజుల క్రితం నాతో మాట్లాడిన ముఖమే మాటిమాటికీ గుర్తుకు వస్తోంది. ఏదో తెలియని అపరాధ భావం నన్ను కమ్ముకోసాగింది. ఎంత కష్టం కలిగిందో అతడి మనసుకి తన ప్రాణం తనే తీసుకున్నాడు. అతడు మంచివాడు కావచ్చు, లేదా కాకపోనూ వచ్చు, కానీ అవసరానికి ఆదుకొమ్మని నన్ను అర్థించాడు. నేనే సాయమూ చేయకుండా పంపించేసాను. బహుశా నేను అతడికి సాయం చేసుంటే బ్రతికే వాడేమో!

నా మనసుని ఎవరో పిండేస్తున్నట్లుగా, ఎన్నో చేతివేళ్ళు నన్నే 'పాయింటౌట్' చేస్తున్నట్లుగా అనిపించింది.

ఎక్కడో ఈక్వేషన్ తప్పుతోంది!

నేను లోయలో పడి మరణపు అంచుల్లో కొట్టుమిట్టాడుతున్నపుడు ఎవరో ముక్కు ముఖం తెలియని వ్యక్తి నన్ను రక్షించి నాకు ప్రాణదానం చేసాడు. అలాంటిది నాకు ఎంతో కొంత పరిచయం ఉన్న ఈ రామరాజుకి నేను ఎటువంటి సాయం చేయలేక పోయాను. నిజంగా ఎంత అమానుషం? బహుశా అందుకేనేమో నా మనసు చేదుగా అవుతోంది.

చేయాలి.. ఏదో ఒకటి చేయాలి.. లేకపోతే ఈ అపరాధ భావం నన్ను ప్రశాంతంగా బ్రతకనిచ్చేట్లు లేదు. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

రామరాజు తల్లి దగ్గరకు చేరుకుని "చూడమ్మా! ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడని బాధపడకు. నిజానికి నాక్కూడా ప్రస్తుతానికి ఎవ్వరూ లేరు. భార్య చనిపోయింది. కొడుకులు, కోడళ్ళూ ఎక్కడో దూరంగా ఉన్నారు. నా దగ్గరకు రమ్మన్నా రారు. ఆ రకంగా నేను కూడా ఒంటరినే! భయపడకు. నేను నిన్ను నా సొంత తల్లిలా చూసుకుంటాను. నువ్వింక పొట్ట కూటికోసం కష్టపడాల్సిన పనిలేదు. నాతో పాటే ఉందువుగాని..రా!" అని ఓదార్చాను. ఆమె అప్రతిభురాలయ్యింది.

నమ్మలేనట్టుగా చూసి "బాబూ!" అంటూ నా కాళ్ళమీద పడిపోయింది.

పోలీసులు రామరాజు శవాన్ని పోస్ట్ మార్టం కోసం తీసుకువెళుతున్నారు.

అతడి తల్లిని తీసుకుని నేను నా ఇంటివైపు కదిలాను.

ఇప్పుడు నాకు చాలా సంతృప్తిగా ఉంది. వేరొకరికి నిజమైన 'సాయం' చెయ్యడంలో ఉన్న ఆనందం తెలిసి వస్తోంది. నన్ను కమ్ముకున్న అపరాధ భావం నెమ్మదిగా తొలగసాగింది.

●●●

Click here to share your comments on this story